క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



తరిగొప్పుల: మండల నూతన తహసీల్దార్‌గా ఎం.నాగేశ్వర చారి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కిష్టయ్య సెలవులపై వెళ్లగా కొన్నిరోజులుగా ఖాళీగా ఉన్న ఆయన స్థానంలో భువనగిరి కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన నాగేశ్వరచారి బదిలీలో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా విధుల్లో చేరారు.

ఎంపీడీఓగా మధుసూదన్



స్టేషన్‌ఘన్‌పూర్: అధికారుల బదిలీల ప్రక్రియలో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ నూతన ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శ్రీపాద మధుసూదన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఘన్‌పూర్ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఉమాదేవి నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం చిల్పూరు మండల ఎంపీఓగా పనిచేస్తున్న శ్రీపాద మధుసూదన్ స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీఓగా నర్సింగరావు



స్టేషన్‌ఘన్‌పూర్ నూతన ఎంపీఓగా కె.నర్సింగరావు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఘన్‌పూర్ ఎంపీఓగా పనిచేస్తున్న సుధీర్‌కుమార్ నల్గొండ జిల్లాకు బదిలీపై వెళ్లగా వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం నుంచి బదిలీపై నర్సింగరావు స్టేషన్‌ఘన్‌పూర్‌కు వచ్చారు. ఈసందర్భంగా నూతన ఎంపీడీఓ, ఎంపీఓగా బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్, నర్సింగరావులకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

యువతి ఆత్మహత్య


అశ్విని (ఫైల్)

రఘునాథపల్లి: ఉరివేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బానాజీపేటలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కురాకుల భిక్షపతి కూతురు అశ్విని (22) డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటోంది. తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లాక తలుపు గడియ పెట్టుకొని ఇంట్లో ఇనుప కడ్డీకి ఉరి వేసుకుంది. తల్లిదండ్రులు పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా కూతురు ఉరికి వేలాడుతూ కనిపించింది. ఉరి నుంచి విడదీయగా అప్పటికే మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతిపై వివరాలు సేకరిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


రమేష్(ఫైల్)

చిల్పూరు: మండల పరిధి వెంకటాద్రిపేట సమీపాన ఉన్న చిన్నపెండ్యాల–తరిగొప్పుల రోడ్డులో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన నోముల రమేష్(45) మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ కుమారుడు రజనీకాంత్ మల్కాపూర్‌లోని పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. కొడుకుతో పని ఉండడంతో రాత్రి 11.30 గంటలకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. 15 నిమిషాల్లో రావాల్సిన తండ్రి రాకపోవడంతో ఫోన్ చేయగా రింగ్ అవుతున్నా లిఫ్ట్ కాలేదు. దీంతో అనుమానం వచ్చి రజినీకాంత్ ఆ దారిలో వస్తుండగా రోడ్డు మధ్యలో తండ్రి మృతి చెంది కనిపించాడు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొడకండ్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరో యువకుడికి గాయాలైన సంఘటన గురువారం మండలకేంద్ర శివారులో చోటు చేసుకొంది. సూర్యాపేట జిల్లా అర్వపల్లికి చెందిన జయంత్(23), తిర్మలగిరి మండలం బండ్లపల్లికి చెందిన సాయికిరణ్(22లు వేగా స్కూటీపై నర్సింగాపురం నుంచి కొడకండ్ల వైపు వస్తూ జగద్గిరిగుట్ట నుంచి రంగాపురం మీదుగా తొర్రూరుకు వెళ్తున్న ఆర్టీసీ హైర్ బస్సును రంగాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనాయి. స్థానికులు, పోలీసులు గాయపడిన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా సాయికిరణ్ మృతి చెందగా జయంత్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు.

పొట్టేళ్ల అపహరణ

బచ్చన్నపేట: దుండగులు గొర్రె పొట్టేళ్లను అపహరించిన సంఘటన మండలంలోని కొడవటూర్ గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసూరి భాస్కర్‌కు చెందిన 3 పొట్టేళ్లు, రాసూరి లక్ష్మయ్య–1, చెట్టే కనుకయ్య–1, మ్యాక అంజయ్య–1 గొర్రె పొట్టేల్‌ను దొంగలు దొడ్లలో నుంచి అపహరించుకుపోయారు. వర్షాలు కురుస్తుండడంతో అందరూ ఇంటి వద్ద నిద్రించడంతో ఈ చోరీ జరిగిందని, పొట్టేళ్ల విలువ రూ.1. 50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● డీఎల్‌పీఓ వెంకటప్రసాద్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డీఎల్‌పీఓ వెంకటప్రసాద్ అన్నారు. మండలంలోని మీదికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం మధ్యాహ్నం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట ఎంపీఓ సుధీర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరులు ఉన్నారు.

మెనూ పాటించాలి

చిల్పూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం మెనూ పాటిస్తూ రుచిగా అందించాలని తహసీల్దార్ సరస్వతి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆమె ఎంపీఓ మధుసూదన్, మండల విద్యాశాఖ నోడల్ అధికారి దాసరి గోవర్దన్‌తో కలిసి సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భోజనం విషయంలో విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు బాపు నాయక్, అజీజ్‌పాషా, రంగారెడ్డి, రాంబాబు, స్నేహ, విమల, శశిధర్‌రెడ్డి, బాబు, రాజు, మధుసూదన్ హెచ్‌ఎంలు నర్సిరెడ్డి, సంపత్ పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వెంకటప్రసాద్


చిల్పూరు: విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న తహసీల్దార్ సరస్వతి


బచ్చన్నపేట: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ


పాలకుర్తి టౌన్: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అనిల్‌రాజ్, చక్రధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని మెనూప్రకారం అందించాలని ఎంపీడీఓ ఎ.రాములు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

28లోగా మళ్లీ రుణాలు ఇవ్వండి

లింగాలఘణపురం: ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణమాఫీ చేసిన రైతులకు ఈ నెల 28వ తేదీలోగా మళ్లీ రుణాలు ఇవ్వాలని జనగామ ఆర్డీఓ కొమురయ్య బ్యాంక్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని రైతులకు రుణమాఫీ జరిగిన నవాబుపేట, నెల్లుట్ల కెనరా బ్యాంక్‌లు, జనగామలోని డీసీసీబీ బ్యాంక్‌లో అధికారులతో మాట్లాడారు. మండలంలో రూ.9.38 కోట్ల రుణమాఫీ 1,829 మందికి జరిగిందని, వీరందరికీ వెంటనే రెన్యూవల్ చేసి మళ్లీ రుణాలను ఇవ్వాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వినయలత, ఏఓ వెంకటేశ్వర్లు, ఆర్ఐ కిశోర్, ఏఈఓ శ్రీనివాస్ ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కొమురయ్య

కార్గిల్ వీరులకు నివాళి

జనగామ: పాక్ కుట్రదారులు దేశంలో ఆక్రమణకు పాల్పడే ప్రయత్నంలో కార్గిల్‌లో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన భారత సైనిక వీరులకు గురువారం బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో నెహ్రూపార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. 25 ఏళ్ల కార్గిల్ విజయాన్ని గుర్తుకు చేసుకుంటూ అమర వీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ తీస్తున్న నాయకులు

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


శిబిరంలో పాల్గొన్న వారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి కమలహాసన్

రఘునాథపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, వాటి నుంచి రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి కమలహాసన్ అన్నారు. మండలంలోని వెల్డి గ్రామంలో ఒకరికి మలేరియా సోకడంతో గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 78 మందికి పరీక్షలు నిర్వహించగా 12 మంది నుంచి రక్త నమూనాలు తీసుకున్నారు. మలేరియా సోకిన వారి ఇంటి చుట్టుపక్క ఇళ్లలో మందు పిచికారీ చేయించారు. వైద్యశిబిరంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శ్యాంసుందర్, సూపర్‌వైజర్ బీకు నాయక్, పంచాయతీ కార్యదర్శి సాయిబాబ, హెల్త్ అసిస్టెంట్ పాండారి, యశోద, కల్పనదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 31లోగా సీఎంఆర్ పూర్తిచేయాలి

● అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ: జిల్లాలో 2023–24 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి సీఎంఆర్ బియ్యాన్ని ఆగస్టు 31లోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రైస్ మిలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 80,684 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లర్లకు ఇవ్వగా, 54,225 మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ ద్వారా ఇవ్వాల్సి ఉందని, ఇప్పటి వరకు 39,364 మెట్రిక్ టన్నుల బియ్యం ఇచ్చినట్లు చెప్పారు. యాసంగిలో 1,42,836 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా 96,960 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌కు ఇప్పటి వరకు 39,364 మెట్రిక్ టన్నులు ఇచ్చినట్లు వివరించారు. సీఎంఆర్ బియ్యం అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. డీసీఎస్‌ఓ రోజారాణి, సివిల్ సప్లయీస్ డీఎం ప్రసాద్, డీటీలు శ్రీనివాసు, దేవా, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పజ్జూరి జయహరి, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, ముత్తయ్య, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

పార్టీ బలోపేతానికి కృషి



లింగాలఘణపురం: జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో సీపీఐ మండల విస్తృత స్థాయి సమావేశం మండల కార్యదర్శి సదానందం అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా రాజారెడ్డి హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పోటీ చేయాలని కోరారు. అదే విధంగా ప్రజా సమస్యలను పరిష్కరించే దిశలో పోరాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ఉద్యమించాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి సాయన్న, నాయకులు జనార్దన్, ఎల్లయ్య, కుమార్, అంజయ్య, సిద్దులు, చంద్రశేఖర్, ఉప్పలయ్య, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వృత్తినైపుణ్యంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు

దేవరుప్పుల: వృత్తినైపుణ్యం పెంచుకోవడంతో జీవనోపాధి పొందుతున్న రంగాల్లో ఆర్థికంగా బలోపేతంతోపాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయని ఎస్సై ఊర సృజన్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఈ నెల 26,27,28 తేదీల్లో హైదరాబాద్‌లో తలపెట్టిన ఫొటో ఎక్స్‌పో వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నేటి జీవనవిధానాలను భావితరాలకు పదిలంగా భద్రపర్చే ఫొటో, వీడియో గ్రాఫర్లు నూతన సాంకేతిక రంగాలపై మరింత శిక్షణ పొంది రాణించాలని సూచించారు. జిల్లా సహాయ కార్యదర్శి బండారి యాదగిరి, మండల అధ్యక్షుడు వీరునాయక్, మండల కార్యవర్గ సభ్యులు నల్ల సతీష్, ఇనుముల నాగరాజు, శ్రీకాంత్, నరేందర్ పాల్గొన్నారు.


ఫొటో ఎక్స్‌పో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్సై సృజన్‌కుమార్ తదితరులు

వర్గీకరణతోనే ఆర్థిక అసమానతలు దూరం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవరుప్పుల: ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాల ఆర్థిక అసమానతలు దూరమై అభ్యున్నతి పొందుతారని ఎమ్మార్పీఎస్ (మేడి పాపన్న వర్గం) రాష్ట్ర అధికార ప్రతినిధి నీరటి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు మేడ స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆగస్టు 9వ తేదీన ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద 100 రోజుల్లో వర్గీకరణ డిమాండ్ కోసం తలపెట్టిన చలో ఢిల్లీ కరపత్రాలను మండల అధ్యక్షుడు మహకాళి విష్ణు ఆధ్వర్యంలో వారు ఆవిష్కరించారు. పలు సామాజిక సంఘాల ప్రతినిధులు దావెర అనిల్‌కుమార్, గనుపాక రమేష్, ప్రదీప్, నాగరాజు,పులిగిళ్ల అఖిల్, సాత్విక్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని సెకండరీ పాఠశాల విద్యార్థులకు దాతలు అందించిన నోట్ బుక్స్‌ను హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు గొట్టె కనుకయ్య, గట్టు రామచంద్రం, భాస్కరుని పృథ్వీరాజ్, నర్సింమారెడ్డి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

జనగామ రూరల్: వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నియోజకవర్గ ఉద్యమ నిర్మాత సీపీ రెడ్డి వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం కామాక్షి ఫంక్షన్ హాల్‌లో సభ ఉంటుందన్నారు. కార్యక్రమానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో బొట్ల శ్రీనివాస్, జోగు ప్రకాశ్, పందిళ్ల కళ్యాణి, పల్లెర్ల లలిత, బాల్నె వెంకటమల్లయ్య, కళ్యాణ లింగం, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తాగునీరు సక్రమంగా అందించాలి


మాట్లాడుతున్న ఈఈ శ్రీకాంత్

బచ్చన్నపేట : గ్రామాలకు తాగు నీటిని సక్రమంగా ప్రతి రోజూ అందించాలని మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని కొడవటూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. తాగునీటి సరఫరాపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలంలో తాగునీటి పైపులు లీకేజీ లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఏఈ ప్రశాంత్, హెచ్‌ఎం రాజ్యశ్రీ, పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య, ఫీల్డ్ అసిస్టెంట్ మిన్నాల పురం అశోక్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మండల కేంద్రాన్ని సమగ్రాభివృద్ధి చేసుకుందాం

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మండల కేంద్రాన్ని సమగ్రాభివృద్ధి చేసుకుందామని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు అధ్యక్షతన దేవరుప్పుల కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహకారంతో దారిద్ర్యరేఖ దిగువనున్న నిరుపేదలకు గూడు, అభాగ్యులకు ఆసరా ఫించన్లు, గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగు కోసం విరివిగా నిధులు కేటాయింపు చేసుకుని అభివృద్ధిలో పురోగతి సాధిద్దామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఉప్పల సురేష్‌బాబు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నాగరాజు, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య, బోనగిరి యాకస్వామి పాల్గొన్నారు.


దేవరుప్పుల: మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

కొడకండ్ల: పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమీక్ష సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్లాక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ధరావత్ సురేష్‌నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. పాలకుర్తి మండలం కోమటిగూడెం గ్రామానికి చెందిన పరుష నరేశ్ ఆరు నెలల క్రితం జనగామలో రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో తలకు గాయమైంది. అప్పటి నుంచి ఒక్కోసారి సైకోలా మారి వెకిలి చేష్టలకు పాల్పడుతున్నాడు. అంతే కాకుండా మద్యానికి బానిసయ్యాడు. గురువారం అతిగా మద్యం సేవించిన నరేశ్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద చొక్కా తీసేసి హల్‌చల్ చేశాడు. బస్టాండ్ వద్ద ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. కానిస్టేబుల్స్ కుమారస్వామి, యాకన్న బస్టాండ్ వద్దకు చేరుకుని హంగామా చేస్తున్న నరేశ్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మత్తు దిగాక కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేసినట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురి రిమాండ్

చిల్పూరు: పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేయడంతోపాటు స్టేషన్‌పై దాడికి పాల్పడి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన పల్లగుట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని మారేపల్లిగూడేనికి చెందిన ఐదుగురిని పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11వ తేదీన బాలిక హైదరాబాద్‌లో మృతి చెందగా తండ్రే కూతురును చంపాడంటూ అతడిపై దాడి చేయడానికి బంధువులు ప్రయత్నించగా తప్పించుకుని పోలీస్‌స్టేషన్‌కు చేరాడు. దీంతో కులస్తులు, బంధువులు మృతదేహంతో స్టేషన్ ఎదుట ధర్నా చేయడంతోపాటు స్టేషన్‌లోపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం, విధులకు ఆటంకం కలిగించారు. దాడికి పాల్పడిన వారి వివరాలను ఏఎస్సై జయకుమార్ సేకరించి కేసు నమోదు చేశారు. కాగా, మారేపల్లిగూడేనికి చెందిన మచ్చ విజయ్, మచ్చ నరేశ్, మచ్చ దయాకర్, మచ్చ శ్రీకాంత్, మచ్చ రాజశేఖర్‌లను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన



లింగాలఘణపురం: మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ప్రభుత్వంలో విలీనం చేసి 010 పద్దులో వేతనాలు ఇవ్వాలని, బదిలీలు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం పాఠశాల ఆవరణలో ప్లేకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సెకండ్ ఫేజ్‌లో నియామకమైన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, హెల్త్‌కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, కారుణ్య నియామకాలు చేపట్టాలని అన్నారు. ప్రిన్సిపాల్ పుష్పకుమారి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష వీడాలి

రఘునాథపల్లి: తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష వీడాలని జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోరెడ్డి లక్ష్మీప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షత చూపడం దారుణమన్నారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి గెలిచిన ఎంపీలు తెలంగాణకు నిధులు తేవడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణపై కేంద్రం వివక్షతపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని ఆమె హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

పేకాటరాయుళ్ల అరెస్టు

దేవరుప్పుల: మండలంలోని చిన్నమడూరు శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. గురువారం చిన్నమడూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడిచేయగా ఇదే గ్రామానికి చెందిన వెంకటేష్, అంజయ్య, సోమయ్యలను అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుంచి రూ.5,750, రెండు సెల్‌ఫోన్లు, పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎంతవారైనా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌సుందర్, కానిస్టేబుల్ యాకేష్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపును పెంచాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. మండలంలోని సాగరం గ్రామంలో గురువారం నిర్వహించిన ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయ రంగం ఎరువులు, సబ్సిడీ, ఫసల్ బీమా, ఉపాధి హామీ పథకం నిధులు తగ్గించడం దారుణమన్నారు. సమ్మయ్య, కుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన తమ్మలి శ్రీజ వైద్య ఖర్చుల నిమిత్తం సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట అశోక్, కుమారస్వామి, ప్రశాంత్, రమేశ్ ఉన్నారు.

ఎన్నిక


శ్రీరాములు

దేవరుప్పుల: కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా నల్ల శ్రీరాములును ఎన్నుకున్నట్టు ఆ విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌గౌడ్, తోటకూరి గట్టయ్య తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా గుగులోత్ గణపతి, టి.మహేష్, కార్యదర్శిగా పి.ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా అనంతపూర్ ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా బి.లక్‌పతి, కార్యవర్గ సభ్యులుగా తరుణ్‌కుమార్, రాజు. శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

నివాళి

కొడకండ్ల: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ హోంగార్డు ఈదుల విద్యాకుమార్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై బండి శ్రావణ్‌కుమార్, ఏఎస్సై కత్తి రమేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది గురువారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సాంస్కృతిక సంబురాలు



జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో సాహిత్య సాంస్కృతిక క్లబ్ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక సంబురాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలన్నారు. అనంతరం ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు సాహిత్య పుస్తకాలు అందజేసి అభినందించారు. కందకట్ల గణేశ్, డాక్టర్ మహేందర్, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు జానీనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.